## నల్లగొండ ఎంపీ టికెట్ ఇవ్వాలి


మాట్లాడుతున్న రవీంద్రనాయక్

హిమాయత్‌నగర్, ఫిబ్రవరి 24 : రానున్న లోక్‌సభ ఎన్నికల్లో నల్లగొండ ఎంపీ టికెట్ తనకే కేటాయించాలని బీజేపీ రాష్ట్ర కోర్ కమిటీ సభ్యుడు, మాజీ ఎంపీ డి.రవీంద్రనాయక్ కేంద్ర, రాష్ట్ర నాయకత్వానికి విజ్ఞప్తి చేశారు. శనివారం హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ..గిరిజనుల అక్షరాస్యత పెంచేందుకు ములుగు జిల్లాలో ఏర్పాటు చేయనున్న కేంద్రీయ గిరిజన విద్యాలయం లో 50 శాతం గిరిజన విద్యార్థులకు అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఎస్టీలకు ప్రత్యేకంగా కమిషన్ ఏర్పాటు చేయడంతో పాటు తెలంగాణ సమగ్రాభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం తోడ్పాటునందించాలని కోరారు.



గీత వృత్తిలో మరణించిన బాధిత కుటుంబాలు, గాయపడిన కార్మికులకు తక్షణసాయం అందజేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్‌ను గౌడ హాస్టల్ డైరెక్టర్ నోముల సిద్ధూగౌడ్ కలిసి వినతి పత్రం సమర్పించారు.


- హిమాయత్‌నగర్, ఫిబ్రవరి 24

# స్వచ్ఛతలో 'రాజేంద్రనగర్'కు ప్రశంసలు




రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని జీహెచ్ఎంసీ అధికారులు చెత్తపై సమరం మోగించారు. పరిసరాల పరిశుభ్రతతో పాటు ఇంటింటి చెత్త సేకరణను సమర్థవంతంగా చేపట్టారు. దీంతో సర్కిల్ పరిధిలోని 15 ప్రాంతాల్లో చెత్త పాయింట్లను తొలగించారు. దీనిని గుర్తించిన జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్‌రెడ్డితో పాటు బల్దియా కమిషనర్ రొనాల్డ్‌రాస్.. రాజేంద్రనగర్ జీహెచ్ఎంసీ ఉప కమిషనర్ రవికుమార్, ఇతర శానిటేషన్ అధికారులు, సిబ్బందిని అభినందించి ప్రశంసా పత్రాలను అందజేశారు.

- బండ్లగూడ, ఫిబ్రవరి 24


వెంగళరావునగర్ కాలనీలో వెలగని వీధి దీపాలు

## వెలగని.. వీధి దీపాలు

వెంగళరావునగర్, ఫిబ్రవరి 24 : వెలగని విద్యుత్ దీపాలతో జనం ఇబ్బందులు పడుతున్నారు. వెంగళరావునగర్ డివిజన్‌లోని వెంగళరావునగర్ కాలనీ అయ్యప్ప గ్రౌండ్ నుంచి బ్రహ్మం పాఠశాలకు వెళ్లే రహదారిలో చిమ్మచీకట్లు కమ్ముకున్నాయి. వాహనాల రాకపోకలు సాగించేటప్పుడు చీకట్లో వాహనాలు కనిపించక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అంతే కాకుండా రాత్రి వేళల్లో ద్విచక్ర వాహనాల చోరీలు జరుగుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. బల్దియా సిబ్బందికి పలుమార్లు ఫిర్యాదు చేశామని, అయినా పట్టించుకోలేదని స్థానికులు పేర్కొన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి వీధి దీపాలు వెలిగేలా చొరవ తీసుకోవాలని కోరుతున్నారు.




### యూసుఫ్‌గూడ సర్కిల్‌లో..

జూబ్లీహిల్స్, ఫిబ్రవరి24 : పారిశుధ్య నిర్వహణలో ఉత్తమ సేవలందిస్తున్న శానిటరి సిబ్బందికి జీహెచ్ఎంసీ కమిషనర్ రొనాల్డ్ రాస్, మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతాశోభన్ రెడ్డి ప్రశంసా పత్రాలను ప్రదానం చేశారు.

జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో యూసుఫ్‌గూడ సర్కిల్‌లో ఉత్తమ సేవలందించిన శానిటరి ఫీల్డ్ అసిస్టెంట్‌లు అహ్మద్, ఎం.వీరగిరి, ఎ.రాంబాబు, జె.వెంకటయ్య, ఆనంద్‌రావు, టి.సంతోష్, వి.శంకర్‌కు శనివారం సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ 19వ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ సేవా ఇస్లావత్, ఏఎంఓహెచ్ రవి పాల్గొన్నారు.



## ముగిసిన సమ్మక్క సారక్క జాతర

రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో సమ్మక్క సారక్క జాతర శనివారం ముగిసింది. చివరి రోజు అనేక మంది భక్తులు పాల్గొని అమ్మవార్లను దర్శించుకున్నారు. రాజేంద్రనగర్ శివారు ప్రాంతాల నుంచి భక్తులు అమ్మవార్లను దర్శించుకునేందుకు వచ్చినట్లు నిర్వాహకులు చంద్రకుమార్ తెలిపారు. ఆదివారం తమ కుటుంబ సభ్యులందరూ కలిసి అమ్మవార్లను వనంలోకి పంపనున్నట్లు పేర్కొన్నారు. - బండ్లగూడ, ఫిబ్రవరి 24

## మార్చి 2న టీ హబ్‌లో స్టూడెంట్ సమ్మిట్

ఖైరతాబాద్, ఫిబ్రవరి 24 : విద్యార్థులు పోటీ ప్రపంచంలో నిలదొక్కుకునేందుకు విషయ పరిజ్ఞానంపై అవగాహన కల్పించేందుకు మార్చి 2న టీ హబ్‌లో స్టూడెంట్ సమ్మిట్ నిర్వహించనున్నట్టు స్టూడెంట్ ట్రైబ్ సంస్థ నిర్వాహకులు చరణ్, వరుణ్ తెలిపారు. సోమాజిగూడలో శనివారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. ఇంటర్ పూర్తయిన తర్వాత విద్యార్థులు తమ భవిష్యత్తును ఎంచుకునేందుకు అనేక అపోహలు పడుతుంటారని, ఉన్నత విద్యావకాశాలు, కేరీర్ గైడెన్స్ తదితర అంశాలపై ఈ సమ్మిట్‌లో ప్రముఖ యూనివర్సిటీలకు చెందిన ప్రొఫెసర్లు పాల్గొని అవగాహన కల్పిస్తారని వెల్లడించారు. ఈ సమ్మిట్‌కు 2వేల మంది విద్యార్థులు హాజరవనున్నట్లు తెలిపారు.




## తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలి

వెంగళరావునగర్, ఫిబ్రవరి 24 : ఇండ్ల నుంచి తడి,పొడి చెత్తను వేరు చేసి సేకరించాలని వెంగళరావునగర్ కార్పొరేటర్ దేదీప్య విజయ్ అన్నారు. శనివారం యూసుఫ్‌గూడలోని జీహెచ్ఎంసీ సర్కిల్ కార్యాలయంలో పారిశుధ్య అధికారులు, రాంకీ సిబ్బందితో ఉప కమిషనర్ సేవా ఇస్లావత్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి కార్పొరేటర్ హాజరై మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణకు సహకరించాలన్నారు. గ్రీన్ వేస్టేజ్‌కు ఒక వాహనం, సీ అండ్ డీకి మరో వాహనాన్ని ఏర్పాటు చేయాలని రాంకీ సిబ్బందిని కోరారు. స్వచ్ఛ ఆటోలు, ఎస్ఎఫ్ఏ, ఏఎంహెచ్ఓ, రాంకీ సమన్వయంతో పని చేయాలన్నారు. ఈ సమావేశంలో ఏఎంహెచ్ఓ రవి, రాంకీ ఇన్‌చార్జి సిరాజ్ పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న ఉప కమిషనర్ సేవా ఇస్లావత్, కార్పొరేటర్ దేదీప్య విజయ్

## నేడు కోకాపేటలో మల్లన్న బోనాలు

మణికొండ, ఫిబ్రవరి 24 : నార్సింగి మున్సిపాలిటీ కోకాపేటలో ఆదివారం యాదవ సంఘం ఆధ్వర్యంలో మల్లన్న బోనాలను నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు నిర్వాహకులు వెల్లడించారు. తెల్లవారుజాము నుంచే ఆలయంలో పూజలు నిర్వహించనున్నారు. ఆదివారం ఉదయం గంపల ఊరేగింపుతో మల్లన్న ఆలయం వద్దకు చేరడం, 10 : 30 గంటలకు మల్లికార్జున స్వామి జీవిత చరిత్ర ఒగ్గు కథ, ఉదయం 11: 52 గంటలకు శ్రీ భ్రమరాంబ క్యాతమ్మ మల్లికార్జున స్వామి వార్ల కల్యాణం నిర్వహిస్తారు. సాయంత్రం అగ్నిగుండాలు, గొలుసు తెంపుట ఉంటాయని పేర్కొన్నారు. కోకాపేటతో పాటు చుట్టు పక్కల ప్రాంతాల నుంచి భక్తులు పాల్గొని స్వామి వారిని దర్శించుకోనున్నారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు.

## మార్చి 20న అవార్డులు ప్రదానం


ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్కకు ఆహ్వాన పత్రికను అందజేస్తున్న నిర్వాహకులు సంజోష్ తదితరులు

బంజారాహిల్స్, ఫిబ్రవరి 24: వివిధ రంగాల్లో ప్రతిభ కనబర్చిన వ్యక్తులకు ఇచ్చే 'జోష్' సౌత్ ఇండియన్ నంది అవార్డుల ప్రదానం కార్యక్రమం మార్చి 20న రవీంద్ర భారతిలో నిర్వహించనున్నట్లు సంస్థ చైర్మన్ సంజోష్ తగరం తెలిపారు. శనివారం ఉప ముఖ్యమంత్రి మల్లు బట్టి విక్రమార్కను కలిసి ఆహ్వానపత్రికను అందజేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. సినీ రంగంలో ఉత్తమ చిత్రం, ఉత్తమ నటీనటులు, దర్శకులు, సాంకేతిక నిపుణులకు, ఇతర రంగాల్లో ప్రతిభ కనబర్చిన వారికి అవార్డులు ఇవ్వాలని నిర్ణయించుకున్నామని తెలిపారు. ఈ కార్యక్రమానికి సీఎం రేవంత్ రెడ్డి, సినీ, రాజకీయ ప్రముఖులు హాజరుకానున్నారని వెల్లడించారు.



## మహాశివ పడిపూజ

శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని శ్రీ వెండికొండ సిద్ధేశ్వర్ ఆలయం వద్ద శివస్వాముల ఆధ్వర్యంలో మహాశివ పడిపూజను శనివారం వైభవంగా నిర్వహించారు. పూజలో శంషాబాద్ మున్సిపల్ వైస్ చైర్మన్ బండి గోపాల్‌యాదవ్ పాల్గొని మాట్లాడారు. పరమశివుడిని కొలిచిన ప్రతి భక్తుడికి ఆయన ఎల్లవేళలా అండగా ఉంటాడన్నారు. కార్యక్రమంలో శివమాల ధరించిన స్వాములు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

- శంషాబాద్ రూరల్, ఫిబ్రవరి 24

### హోటల్ యజమానికి జరిమానా


జరిమానా రసీదును అందజేస్తున్న శానిటేషన్ అధికారి లక్ష్మయ్య

శంషాబాద్ రూరల్, ఫిబ్రవరి 24 : పరిశుభ్రత పాటించని ఓ హోటల్ యజమానికి జరిమానా విధించినట్లు శానిటేషన్ అధికారి లక్ష్మయ్య తెలిపారు.శంషాబాద్ మున్సిపాలిటీ పరిధి.. తొండుపల్లిలోని ఓ హోటల్‌లో యాజమాన్యం నిర్లక్ష్యంతో తినే భోజనంలో ఈగలు వస్తున్నాయి. దీంతో వారిని ప్రశ్నిస్తే బెదిరింపులకు పాల్పడినట్లు సదరు బాధితుడు మున్సిపల్ కార్యాలయంలో ఫిర్యాదు చేశాడు. స్పందించిన అధికారులు శనివారం హోటల్‌పై దాడులు నిర్వహించారు. హోటల్‌లో ఎలాంటి పరిశుభ్రత పాటించకపోవడంతో సదరు యజమానికి ఐదు వేల జరిమానా విధించారు. ఈ సందర్భంగా శానిటేషన్ అధికారి మాట్లాడుతూ.. హోటళ్లలో పరిశుభ్రత పాటించాలని, లేకపోతే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

### తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

బండ్లగూడ, ఫిబ్రవరి 24 : తాళం వేసి ఉన్న ఇంట్లో దొంగలు పడి బంగారం, వెండి ఆభరణాలు దోచుకెళ్లారు. రాజేంద్రనగర్ పోలీసుల కథనం ప్రకారం.. హైదర్‌గూడ కేశవనగర్ కాలనీలో ఓ ఇంటి యజమాని ఇంటికి తాళం వేసి కర్నూల్‌లో పెళ్లికి వెళ్లారు. శుక్రవారం అర్ధరాత్రి ఇంటితాళం పగులగొట్టి ఇంట్లో ఉన్న బంగారంతో పాటు వెండి ఆభరణాలు ఎత్తుకెళ్లారు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఈ ఘటనపై ఇప్పటి వరకు ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

## జర్నలిస్టు కాలనీ చౌరస్తాలో విగ్రహాన్ని వెనకకు జరపాలి

- రద్దీ రోడ్డుపై విగ్రహం ఏర్పాటు చేయడం సరికాదు
- డీఎంసీ ప్రశాంతికి వినతిపత్రం


డీఎంసీ ప్రశాంతికి వినతిపత్రం అందజేస్తున్న ఫిలింనగర్ బస్తీల నాయకులు

బంజారాహిల్స్, ఫిబ్రవరి 24 : జూబ్లీహిల్స్ రోడ్ నం.1లోని ప్రధాన రహదారిపై జర్నలిస్టు కాలనీ చౌరస్తా వద్ద ట్రాఫిక్‌కు ఇబ్బందికరంగా ఉన్న విగ్రహాన్ని వెనకకు జరపాలని డివిజన్‌కు చెందిన పలు బస్తీల నాయకులు డీఎంసీని కోరారు. అక్కడే మరో పెద్ద విగ్రహం ఏర్పాటుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని, వాటిని అడ్డుకోవాలని శనివారం సర్కిల్ కార్యాలయంలో డీఎంసీ ప్రశాంతికి వినతిపత్రం అందజేశారు. అనంతరం స్థానిక నాయకులు కాటూరి రమేశ్, ఆకుల రమేశ్, పి.రవి, బాలస్వామి, రవి నాయక్, ఆంజనేయులు మాట్లాడుతూ.. ఫిలింనగర్ నుంచి జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ వైపునకు నిత్యం వేలాది వాహనాలు ప్రయాణించే జర్నలిస్టు కాలనీ చౌరస్తాను విస్తరించాల్సి ఉందని, కానీ ఇప్పటివరకు చర్యలు తీసుకోలేదన్నారు. కనీసం చౌరస్తాలో ఉన్న ప్రముఖ జర్నలిస్టు మనికొండ చలపతిరావు విగ్రహాన్ని కొద్దిగా వెనకకు జరిపితే ట్రాఫిక్ సమస్యలు తీరుతాయన్నారు. ప్రస్తుతం ఉన్న విగ్రహం స్థానంలో మరో పెద్ద విగ్రహం ఏర్పాటు చేసేందుకు భారీ దిమ్మె ఏర్పాటు పనులు జరుగుతున్నాయని, ఈ పనులను నిలిపివేయాలని కోరారు. ఫిలింనగర్ బస్తీవాసుల కోరిక మేరకు విశాలమైన సీవీఆర్ చౌరస్తా వద్ద ఛత్రపతి శివాజీ మహరాజ్ విగ్రహం ఏర్పాటుకు అనుమతి కోరితే ఇవ్వలేదన్నారు. కానీ, ఇరుకైన జర్నలిస్టు కాలనీలో పెద్ద విగ్రహం ఏర్పాటుకు అనుమతి ఎలా ఇచ్చారని ప్రశ్నించారు.

## 'విద్యుత్'లో అంతరాయం లేకుండా చూడాలి


మాట్లాడుతున్న ఇబ్రహీంబాగ్ విద్యుత్ డివిజనల్ ఇంజినీర్ శివశంకర్

మణికొండ, ఫిబ్రవరి 24: వినియోగానికి అనుగుణంగా ఉత్పత్తి సంపూర్ణంగా ఉందని, క్షేత్రస్థాయిలో విద్యుత్ శాఖ అధికారులు బాధ్యతాయుతంగా పని చేస్తూ సరఫరాలో అప్రమత్తంగా ఉండాలని ఇబ్రహీంబాగ్ విద్యుత్ డివిజనల్ ఇంజినీర్ ఎం.శివశంకర్ అన్నారు. ఇబ్రహీంబాగ్ డివిజన్ కార్యాలయంలో శనివారం సమావేశంలో అసిస్టెంట్ డివిజనల్ ఇంజినీర్ అంబేద్కర్, అసిస్టెంట్ ఇంజినీర్లు సందీప్‌రెడ్డి, జ్ఞానేశ్వర్‌లతో కలిసి ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం వినియోగదారులకు నిరంతరం విద్యుత్ అందించాలనే లక్ష్యంతో ముందుకు వెళ్తున్నదన్నారు. సరఫరాలో అంతరాయంపై అప్రమత్తంగా లేకపోతే అధికారులు, సిబ్బందిపై చర్యలు తీసుకుంటుందని హెచ్చరించారు. వినియోగదారులకు సరఫరాలో సమస్యలు ఉత్పన్నమైతే..ఎస్ఈ సైబర్ సిటీ 9440813046, డీఈ ఇబ్రహీంబాగ్ 7901093677, ఏడీఈ ఇబ్రహీంబాగ్ 94408 13060, ఏఈ ఇబ్రహీంబాగ్ 9440813097, ఏఈ నార్సింగి 8995207211, ఎఫ్ఓసీ ఇబ్రహీంబాగ్ 9493193119, ఎఫ్ఓసీ నార్సింగి 9491292118 లో ఫిర్యాదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో విద్యుత్ లైన్ ఇన్‌స్పెక్టర్లు, లైన్‌మెన్‌లు పాల్గొన్నారు.

### సాంస్కృతిక పోటీలు వాయిదా

ఉస్మానియా యూనివర్సిటీ, ఫిబ్రవరి 24: ఉస్మానియా యూనివర్సిటీ అంతర్ కళాశాలల సాంస్కృతిక పోటీ లు 2023–24ను వాయిదా వేసినట్లు అధికారులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలను ఈ నెల 27, 28 తేదీల్లో నిర్వహించనున్నట్లు గతం లో ప్రకటించినప్పటికీ వాటిని వాయి దా వేసినట్లు చెప్పారు. పోటీలను తిరిగి ఏప్రిల్ 3, 4 తేదీల్లో నిర్వహిస్తామని పేర్కొన్నారు. పోటీల్లో పాల్గొనేందుకు దరఖాస్తులను వచ్చే నెల 2 వరకు స్వీకరిస్తామని స్పష్టం చేశారు.



చిలకలగూడ ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనలపై శనివారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఆలుగడ్డబావి చౌరస్తాలో ట్రిపుల్ , సెల్‌ఫోన్ డ్రైవింగ్, హెల్మెట్ లేకుండా డ్రైవింగ్‌తో పాటు ఇతర ఉల్లంఘనలపై ప్లకార్డులతో అవగాహన కల్పించారు. ఈస్ట్‌జోన్ ట్రాఫిక్ ఏసీపీ సంపత్‌కుమార్, సీఐ శ్రీనివాసులు మాట్లాడుతూ ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని సూచించారు. ఉల్లంఘనలను ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. నిబంధలు పాటిస్తూ భద్రంగా తమ ప్రయాణాన్ని కొనసాగించాలని సూచించారు. - ఉస్మానియా యూనివర్సిటీ, ఫిబ్రవరి 24

### ఓబీసీ మోర్చా రాష్ట్ర కోశాధికారిగా రవి



జూబ్లీహిల్స్, ఫిబ్రవరి 24: భారతీయ జనతా పార్టీ ఓ బీ సీ మోర్చా రాష్ట్ర కోశాధికారిగా యూసుఫ్‌గూడకు చెందిన తాత రవి నియామకమయ్యారు. తాజాగా ప్రకటించిన ఓబీసీ మోర్చా రాష్ట్ర కమిటీలో ఆయనకు అవకాశం దక్కింది. ఈ మేరకు ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు జి.ఆనంద్‌గౌడ్. రవికి నియామక పత్రాన్ని అందజేశారు. శనివారం పలువురు నాయకులు ఆయనకు అభినందనలు తెలిపారు.

### కాంగ్రెస్ గ్రేటర్ ప్రధాన కార్యదర్శిగా శ్యాంసుందర్



గ్రేటర్ హైదరాబాద్ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శిగా ఖైరతాబాద్ నియోజకవర్గ సీనియర్ కాంగ్రెస్ నేత, ఇందిరానగర్‌కు చెందిన చిన్నపట్ల శ్యాంసుందర్ నియమితులయ్యారు. శనివారం బంజారాహిల్స్ రోడ్ నం.12లో ఖైరతాబాద్ డీసీసీ అధ్యక్షుడు డా.సీ.రోహిన్‌రెడ్డి శ్యాంసుందర్‌కు నియామకపత్రాన్ని అందజేశారు.

- బంజారాహిల్స్, ఫిబ్రవరి 24

### అభివృద్ధి పనుల పరిశీలన



అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ 13వ కార్పొరేటర్ ప్రతినిధి బీఆర్ఎస్ సీనియర్ నాయకులు నాగరాజు అన్నారు. డివిజన్ పరిధిలో నూతనంగా చేపట్టిన డ్రైనేజీ నిర్మాణ పనులను శనివారం స్థానికులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అభివృద్ధి పనుల్లో కాంట్రాక్టర్ నాణ్యత ప్రమాణాలను పాటించేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.

- బండ్లగూడ, ఫిబ్రవరి 24

## లక్ష్యసాధనకు కష్టపడాలి

మైలార్‌దేవ్‌పల్లి, ఫిబ్రవరి 24: విద్యార్థులు కష్టపడి చదివితే తమ లక్ష్యాన్ని సులభంగా చేరుకోవచ్చని మహావీర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాల సెక్రటరీ సంరెడ్డి సురేందర్‌రెడ్డి అన్నారు. శనివారం కళాశాలలో గ్లోబల్–లాజిగ్ సంస్థ ఉద్యోగ నియామకాలు(ప్లేస్‌మెంట్ డ్రైవ్) నిర్వహించింది. కళాశాలకు చెందిన 4వ సంవత్సరం విద్యార్థులలో మొత్తం 22 మందిని ఎంపిక చేసి ఉద్యోగ నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా సురేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. అధ్యాపకుల సూచనలు పాటిస్తూ కళాశాలలోని వసతులను ఉపయోగించుకొని విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఉద్యోగ అవకాశాలు పొందిన విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల జాయింట్ సెక్రటరీ సంరెడ్డి ధనుంజయ్‌రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ ఉషశ్రీ, డాక్టర్ ఎం.సుబ్బారెడ్డి, డాక్టర్ నంద గోపాల్‌రెడ్డి, మృదుల పాల్గొన్నారు.


క్యాంపస్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్‌లో పాల్గొన్న విద్యార్థులు, అధ్యాపకులు